సాక్షి
రాజన్న సిరిసిల్ల
శనివారం । 27 । జూలై । 2024

సిరిసిల్లలో కార్గిల్ విజయ్ దివస్

సిరిసిల్ల: స్థానిక సాయినగర్ కార్గిల్ లేక్ వద్ద శుక్రవారం కార్గిల్ విజయ్ దివస్ నిర్వహించారు. వైజయంతి యుద్ధ ట్యాంకర్‌కు పూలమాలలు వేసి, జాతీయ జెండా ఎగుర వేశారు. కార్గిల్‌లో భారత సైన్యం విజయం సాధించి, 25 ఏళ్లు పూర్తయిందని తెలిపారు. మున్సిపల్ మాజీ చైర్మన్, బీజేపీ నాయకుడు ఆడెపు రవీందర్ మాజీ సైనికులను సత్కరించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం రాజు, పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు గాజుల సదానందం, ఊరకొండ రాజు, జిల్లా అధికార ప్రతినిధి బర్కం నవీన్ యాదవ్, నాయకులున్నారు.



ఆర్థిక సర్వేలో మెరిసె..

రాజధానికి దీటుగా రోడ్లు


- 'ఉపాధిహామీ'లో కరీంనగర్‌కు రాష్ట్రంలోనే రెండోస్థానం
- తలసరి ఆదాయం, అడవుల పెంపకం ఖర్చులో పెద్దపల్లి టాప్
- చిన్న, మధ్య తరహా యూనిట్లలో జగిత్యాల ముందంజ
- వ్యవసాయ కనెక్షన్లు రాజన్నసిరిసిల్లలో ఎక్కువ
- బడ్జెట్‌లో భాగంగా సామాజిక, ఆర్థిక సర్వే–2024 వెల్లడి



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: మనిషికి రక్తనాళాలు ఎలాగో.. దేశ ఆర్థిక వ్యవస్థకు రోడ్లు అంతే ముఖ్యం. వాటి విస్తరణలో రాష్ట్ర రాజధాని తర్వాత అత్యధికంగా రోడ్లు మన ఉమ్మడి జిల్లాలోనే ఉన్నాయి. ఈ విషయాన్ని ప్రభుత్వ ప్రణాళిక విభాగం విడుదల చేసిన ఆర్థిక సర్వే–2024 నివేదిక వెల్లడించింది. వివిధ రంగాల వారీగా సమగ్ర అభివృద్ధికి కృషి చేయడంతో తలసరి ఆదాయం పెరిగింది. ఉపాధిహామీ ద్వారా పనిదినాలు కల్పించడంలో నాలుగు జిల్లాలు పోటీ పడుతున్నాయి. కంపా నిధుల్లో పెద్దపల్లి అగ్రభాగాన, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల్లో జగిత్యాల ముందంజలో.. రైతుల వద్ద సగటు భూమిలో సిరిసిల్ల శిఖర స్థానంలో నిలిచాయి.

వ్యవసాయ రంగంలో ఎక్కువ మంది..

ఉమ్మడి జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్నా ఎక్కువ మంది ప్రజలు వ్యవసాయం రంగంలోనే ఉపాధి పొందుతున్నారు. మొత్తం జనాభాలో సగటున 52 శాతం మంది వ్యవసాయాధారిత పనుల్లోనే ఉన్నారు.



రోడ్డు డెన్సిటీలో బెటర్..

రాష్ట్రంలో రోడ్డు డెన్సిటీ 100 చదరపు కిలోమీటర్లుకు 98.8 కి.మీ. రహదారులుండగా, జిల్లాల వారీగా చూస్తే హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ తర్వాత కరీంనగర్ జిల్లానే ఎక్కువ రోడ్డు డెన్సిటీ కలిగి ఉంది.

ర్యాంకు	జిల్లా	రోడ్డు డెన్సిటీ
4	కరీంనగర్	137.4
11	సిరిసిల్ల	112.4
18	పెద్దపల్లి	97.2
13	జగిత్యాల	107.2

రైతు సగటు భూమి రెండెకరాల్లోపే..


వ్యవసాయ లెక్కల ప్రకారం రైతుల వద్ద సగటు వ్యవసాయ భూమి చాలా తక్కువగా ఉంది. ఒక్కో రైతు వద్ద 1.5 హెక్టార్లతో ఆదిలాబాద్ ప్రథమ స్థానంలో ఉంది. రాజన్నసిరిసిల్ల 0.83 (22వ స్థానం) హెక్టార్లు, జగిత్యాల 0.77(26వ స్థానం) హెక్టార్లు, పెద్దపల్లి 0.76(27వ స్థానం) హెక్టార్లు, కరీంనగర్ 0.75(29వ స్థానం) హెక్టార్లు ఉన్నాయి.

పచ్చదన పెంపునకు ఖర్చు..

రాష్ట్ర ప్రభుత్వం కొన్నేళ్లుగా అడవుల పెంపకం, సంరక్షణ కోసం తీసుకున్న చర్యలతో అడవుల విస్తీర్ణం క్రమేపీ పెరుగుతోంది. ఇందుకోసం కేటాయించిన కంపా నిధుల్లో అత్యధికంగా పెద్దపల్లిలో 81.20 శాతం ఖర్చు చేయగా, రాజన్న సిరిసిల్లలో 52.46 శాతం, జగిత్యాలలో 43.92 శాతం, కరీంనగర్‌లో 73.60 శాతం నిధులు పచ్చదన పెంపు కోసం ఖర్చు చేస్తున్నారు.

రేషన్ కార్డులే అధికం..

ఉమ్మడి జిల్లాలో గ్యాస్ కనెక్షన్లు, రేషన్ కార్డులు కుటుంబాల కంటే అధికంగా ఉన్నాయి. ఇవి అన్నపూర్ణ, అంత్యోదయ, ఆహార భద్రతకు సంబంధించినవి. రేషన్ కార్డుల్లో జగిత్యాల, గ్యాస్ కనెక్షన్లలో కరీంనగర్ టాప్‌లో ఉన్నాయి.



తలసరి ఆదాయం..

దేశంలో ప్రతీ వ్యక్తి సంపాదించిన డబ్బు మొత్తాన్ని కొలవడాన్ని తలసరి ఆదాయం అంటారు. ఒక వ్యక్తి ఏడాదిలో సంపాదించిన మొత్తం, ఆయా జిల్లాల జనాభాతో సరిపోల్చి చెప్పేదే తలసరి ఆదాయం. రాష్ట్రంలో పెద్దపల్లి 13వ స్థానంలో ఉండగా, ఉమ్మడి జిల్లాలో మొదటి స్థానంలో నిలిచింది.

జిల్లా	తలసరి ఆదాయం	ర్యాంకు
పెద్దపల్లి	2,31,766	13
కరీంనగర్	22,628	16
సిరిసిల్ల	1,95,479	28
జగిత్యాల	1,83,094	31

విద్యుత్ కనెక్షన్లలో భేష్..

ఉమ్మడి జిల్లాలో వ్యవసాయ, ఇండస్ట్రియల్ విద్యుత్ కనెక్షన్లలో కరీంనగర్ టాప్‌లో ఉండగా, వ్యవసాయ కనెక్షన్లు రాజన్నసిరిసిల్ల, ఇండస్ట్రియల్ కనెక్షన్లు కరీంనగర్‌లో ఎక్కువగా ఉన్నాయి.

ర్యాంకు	జిల్లా	గృహ (శాతం)	వ్యవసాయ (శాతం)	ఇండస్ట్రియల్ (శాతం)
14	కరీంనగర్	68.4	18.6	13
15	పెద్దపల్లి	68.2	21.3	10.6
21	జగిత్యాల	63.6	26.2	10.1
26	సిరిసిల్ల	61.4	27.3	11.2


పెరిగిన పనిదినాలు..

ఉమ్మడి జిల్లాలో అన్ని జిల్లాలు లక్ష్యానికి మించి ఉపాధిహామీ పనిదినాలు కల్పించడంలో పోటీ పడ్డాయి. గతేడాది కంటే ఎక్కువ పనిదినాలు కల్పించారు. అత్యధికంగా కరీంనగర్ 129 శాతంతో రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలవగా, రాజన్నసిరిసిల్ల 5వ, జగిత్యాల 9వ, పెద్దపల్లి 10వ స్థానాల్లో నిలిచాయి.

జిల్లా	పనిదినాల లక్ష్యం (లక్షల్లో)	కల్పించింది (లక్షల్లో)	శాతం
కరీంనగర్	22.2	28.7	129
సిరిసిల్ల	17.6	21.8	124
జగిత్యాల	30.7	37.3	122
పెద్దపల్లి	20.6	25.0	121

పారిశ్రామికంగా పురోగతి..

సహజ వనరులకు నిలయమైన ఉమ్మడి జిల్లా పారిశ్రామిక అభివృద్ధిలో పురోగతిలో ఉంది. గ్రానైట్, బొగ్గు ఆధారిత, ఆహార పరిశ్రమల ఏర్పాటుతోపాటు చిన్న, సూక్ష్మ, పరిశ్రమల స్థాపనలో మరింత ప్రగతి సాధిస్తే ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశాలకు వలసలు ఆగిపోయే అవకాశం ఉంది.



నేడు రైతులకు సలహాలు, సూచనలు

సిరిసిల్ల: జిల్లాలోని రైతులకు సలహాలు, సూచనలు అందించేందుకు శనివారం ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు ఫోన్ ఇన్ నిర్వహిస్తున్నామని జిల్లా వ్యవసాయాధికారి వి.భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, వర్షాలు, వాటికి అనుగుణంగా వేసే పంటలు, మెళకువలు, చీడ పీడలు, నియంత్రణ తదితర అంశాలపై సూచనలు చేస్తామన్నారు. రైతులు తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు.

ఫోన్ చేయాల్సిన నంబర్లు

జిల్లా వ్యవసాయాధికారి	జిల్లా కో–ఆర్డినేటర్, డాట్ సెంటర్, కరీంనగర్
72888 94142	99896 23818

రుణమాఫీ ఎందుకు కాలేదు?

- 'సాక్షి' కథనాలపై స్పందించిన ప్రభుత్వం
- రుణమాఫీ కాని వారి జాబితా పంపాలని ఆదేశం
- రైతు వేదికల్లో ఏఈవోల గ్రీవెన్స్ రిజిస్టర్


షరతులు వర్తిస్తాయి..

సాక్షి ప్రతినిధి,కరీంనగర్: రుణమాఫీ విషయంలో 'సాక్షి' వరుస కథనాలపై ప్రభుత్వం స్పందించింది. అర్హులై ఉండి సాంకేతిక కారణాలతో రుణంరాని రైతుల వివరాలు కనుక్కొని, జాబితా రూపొందించి నివేదిక పంపాలని ఉమ్మడి జిల్లాలోని ఏఈవో (అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన ఆఫీసర్)లకు ఆదేశాలు జారీచేసింది. దీంతో వారు తమ క్లస్టర్ పరిధిలో ఉన్న రైతుల నుంచి ఏ కారణాలతో రుణాల మాఫీ జరగలేదన్న విషయంపై దృష్టిసారించారు. ఈనెల 20, 21న 'సాక్షి' ప్రచురించిన కథనంలో కూచనపల్లి రాజు వద్దకు వెళ్లిన వ్యవసాయాధికారులు త్వరలోనే సమస్య పరిష్కరిస్తానని హామీ ఇవ్వడం గమనార్హం. ఇందులో భాగంగా బాధిత రైతుల వద్దకు వారే వెళ్లడం లేదా రుణమాఫీ జరగలేదంటూ రైతు వేదికల వద్దకు వచ్చే ఫిర్యాదులను నమోదు చేస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా గ్రీవెన్స్ రిజిస్టర్ ఏర్పాటు చేసుకున్నారు. మొత్తంగా ఏ కారణాలతో రుణమాఫీ జరగలేదన్న విషయంపై త్వరలోనే ప్రభుత్వానికి క్లస్టర్లవారీగా నివేదిక పంపనున్నారు.

రైతులు చెప్పే కారణాలివీ..

- కుటుంబ రేషన్‌కార్డు లేని వారికి గుర్తింపు జరగలేదు ఫలితంగా తమకు రుణమాఫీ జరగలేదని రైతులు ఆరోపిస్తున్నారు.
- ఆధార్ మిస్‌మ్యాచ్..ఆధార్ కార్డులో పేరుకు, బ్యాంకు పాస్‌బుక్కులో పేరు స్పెల్లింగ్‌లో వ్యత్యాసం ఉన్నా.. వారికి రుణమాఫీ వర్తించలేదు.
- పాస్‌బుక్కులేని వారికి రుణం రాలేదు.
- లోన్ తీసుకున్నపుడు మైనర్లు ఇపుడు మేజర్ అయినా వారి పేరు రాలేదు.
- బ్యాంకు మేనేజర్ల ఒత్తిడితో బలవంతంగా ముందే లోను కట్టిన వారికి మాఫీ వర్తించలేదు.
- రుణం తీసుకుని మరణించిన వాళ్ల విషయంలోనూ ఇదే జరిగింది. వారి కుటుంబ సభ్యులు బ్యాంకు అధికారుల ఒత్తిడి రుణం కట్టగా.. తీరా ఇపుడు మాఫీ అమలవలేదు.
- గత ప్రభుత్వ హయాంలో సాంకేతిక కారణాల వల్ల రుణమాఫీ జరగని ఖాతాలకు పథకం అమలు కాలేదు.

ప్రభుత్వ కారణాలివీ..

వాస్తవానికి ప్రభుత్వం మొదటి నుంచి చెబుతున్నట్లుగా తాను విధించిన నిబంధనల మేరకు మాఫీ చేసింది.

- కాలపరమితి 12–12–2018 నుంచి 09–12–2023 లోపల రుణం తీసుకోని వారికి వర్తించలేదు.
- 09–12–2023 నాటికిలోను ఖాతాలో ఉన్న అవుట్ స్టాండింగ్ అమౌంట్ ఎంత ఉంటే అంత మాత్రమే మాఫీ అయ్యింది.
- రేషన్‌కార్డు లేని వారికి రుణాలు మాఫీ కాలేదు. ప్రభుత్వం పాసుబుక్కులు ప్రామాణికం అని చెప్పినప్పటికీ.. క్షేత్రస్థాయిలో మాత్రం అది పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చలేదు.
- రుణం రీషెడ్యూల్ చేసుకున్న వారికి కూడా రుణమాఫీ జరగలేదు.
- వీటితోపాటు పీఎం కిసాన్ సమ్మాన్ నిధి వర్తించని వారికి కూడా రుణమాఫీ అవలేదు.

వీటీడీఏ పనుల్లో వేగం పెంచండి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా


మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల: వేములవాడ టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ(వీటీడీఏ) పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. వీటీడీఏ పనులు ఎప్పుడు మొదలు పెట్టారు? ఎక్కడి వరకు పూర్తయ్యాయని తెలుసుకున్నారు. నాణ్యతతో, సకాలంలో పూర్తి చేయాలన్నారు. గుడి చెరువులో బండ్ అండ్ పార్క్ పనులను రూ.12 కోట్లతో ప్రారంభించామని, వచ్చే నెలాఖరులోగా పూర్తి చేస్తామని టూరిజం శాఖ అధికారులు తెలిపారు. ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో దాదాపు ఎకరం విస్తీర్ణంలో రూ.2 కోట్లతో మున్సిపల్ పార్క్ పనులు తుది దశలో ఉన్నాయని పేర్కొన్నారు. వేములవాడ నియోజకవర్గంలోని తిప్పాపూర్, మారుపాకలో మోడల్ లేఅవుట్ పనులు చివరి దశలో ఉన్నాయన్నారు. బద్దిపోచమ్మ ఆలయ పనులపై కలెక్టర్ పలు సూచనలు చేశారు. శివార్చన స్టేజ్ పనులపై ఆరా తీశారు. వేములవాడ ఆలయ అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, టూరిజం శాఖ డీఈ విద్యాసాగర్, జేఈ జీవన్, ఆలయ ఈఈ రాజేశ్, డీఈ రఘునందన్, వీటీడీఏ సెక్రటరీ అన్సారీ, ఎస్టేట్ ఆఫీసర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ తరహాలో గంజాయి టెస్టులు

- ఇప్పటికే 8 మందిపై కేసులు
- ఎస్పీ అఖిల్ మహాజన్
- టెస్టింగ్ కిట్లు ఆవిష్కరణ


కిట్లను ఆవిష్కరిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం: గంజాయి సేవించే వారిని పట్టుకునేందుకు జిల్లాలో గంజాయి టెస్టింగ్ కిట్లు అందుబాటులోకి వచ్చాయని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం అదనపు ఎస్పీ, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ, సిరిసిల్ల టౌన్ సీఐలతో కలిసి వాటిని ఆవిష్కరించారు. ప్రతీ పోలీస్‌స్టేషన్ పరిధిలో నిత్యం డ్రంకెన్‌డ్రైవ్ తరహాలో గంజాయి టెస్టులు నిర్వహించి, గంజాయికి బానిసైన వారిని, రవాణాదారులను పట్టుకుంటామని పేర్కొన్నారు. కిట్ల సహాయంతో ఇప్పటివరకు 8 మందిపై కేసులు నమోదు చేసి, 390 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. గంజాయి రహిత జిల్లాగా మార్చడానికి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమాలు చేపడుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. స్పెషల్ డ్రైవ్‌లు, నార్కోటిక్ జగిలాలతో తనిఖీలు చేపడుతూ గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపుతామని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

వేములవాడ ఆస్పత్రి సందర్శన


వైద్యులు, సిబ్బందితో కాయకల్ప బృందం

వేములవాడఅర్బన్: వేములవాడ ఏరియా ఆస్పత్రిని శుక్రవారం కాయకల్ప బృందం డాక్టర్ హరిప్రియ, డాక్టర్ సాయికిరణ్, సురేశ్ సందర్శించారు. దవాఖానాలో అందిస్తున్న సేవలను పరిశీలించారు. పరిశుభ్రత, పరిసరాల నిర్వహణ, సిబ్బంది పనితీరు, విద్యుత్ వినియోగం, పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల సేకరణ, పచ్చదనానికి ప్రాధాన్యం వంటి విభాగాలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ సంతోష్‌చారి, వైద్యులు తిరుపతి, రత్నమాల, సుభాషిని, కార్యాలయ పర్యవేక్షకుడు నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ లక్ష్మీనారాయణ


కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ప్రిన్సిపాల్, ఆస్పత్రి పర్యవేక్షకుడు

సిరిసిల్ల: స్థానిక మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ బి.లక్ష్మీనారాయణ, జిల్లా జనరల్ ఆస్పత్రి పర్యవేక్షకుడిగా డాక్టర్ ఎస్.నాగార్జున చక్రవర్తి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాను మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించారు. గతంలో పని చేసిన ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్ బదిలీ అయ్యారు.

నేతన్నల పోరుబాట

- ఐదు రోజులుగా రిలే నిరాహార దీక్షలు
- వంటావార్పు, రాస్తారోకో, మానవహారాలతో నిరసన
- నేడు చలో హైదరాబాద్
- వస్త్రపరిశ్రమను ఆదుకోవాలని డిమాండ్


సిరిసిల్లలో మూతపడిన పవర్‌లూమ్ పరిశ్రమ


సిరిసిల్ల అంబేడ్కర్ సర్కిల్ వద్ద రిలే దీక్షలో నేతన్నలు

సిరిసిల్ల: నేతన్నలు పోరుబాట పట్టారు. ఐదు రోజులుగా సిరిసిల్లలో వంటావార్పు, రాస్తారోకో, మానవహారాలతో నిరసన తెలుపుతున్నారు. శుక్రవారం రిలే నిరాహార దీక్ష కొనసాగించారు. సిరిసిల్ల వస్త్రపరిశ్రమ బంద్ పాటిస్తోంది. వస్త్రోత్పత్తి రంగం, అనుబంధ రంగాలకు చెందిన యజమానులు, ఆసాములు, అన్ని రంగాల కార్మికులు ఏకమై.. జేఏసీగా ఏర్పడి, ఆందోళన చేపడుతున్నారు. శనివారం ఛలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చారు. గత ప్రభుత్వం ఇచ్చిన బతుకమ్మ చీరలకు సంబంధించి రూ.300 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని విడుదల చేస్తే వస్త్ర పరిశ్రమలో ఆర్థిక సంక్షోభం కొంత తీరి, బట్ట ఉత్పత్తికి పెట్టుబడిగా ఉపయోగపడతాయి. 20 ఏళ్లుగా వస్త్ర పరిశ్రమకు అందించే 50 శాతం విద్యుత్ రాయితీని కొనసాగించాలని కోరుతున్నారు.

రిలే దీక్షలో నాయకులు..

సిరిసిల్ల అంబేడ్కర్ సర్కిల్ వద్ద శుక్రవారం రిలే నిరాహార దీక్షను పాలిస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆడెపు భాస్కర్, కార్యదర్శి ఆంకారపు రవీందర్, ఆసాముల సంఘం అధ్యక్షుడు సిరిసిల్ల రవీందర్, వార్పిన్ యూనియన్ అధ్యక్షుడు సిరిమల్ల సత్యం ప్రారంభించారు. గజ్జెల్లి శ్రీనివాస్, గాజుల నరేశ్, మచ్చ వేణు, వేముల నర్సయ్య, సామల శ్రీనివాస్, బచ్చు సదానందం, ఆకుబత్తిని లక్ష్మీనారాయణ, పులి శ్రీకాంత్, స్వర్గం చంద్రశేఖర్, గుంటుక సత్యనారాయణ తదితరులు దీక్షలో కూర్చున్నారు.

డిమాండ్లు ఇవే..

- పవర్‌లూమ్స్‌కు 10 హెచ్‌పీ వరకు ఉచిత విద్యుత్ అందించాలి. ఆపై 4వ కేటగిరీగా పరిగణించి 50 శాతం విద్యుత్ రాయితీ ఇవ్వాలి.
- బతుకమ్మ చీరలు లేదా జనతా వస్త్రాల ఆర్డర్లు సిరిసిల్లకు అందించి, ఏటా 15 కోట్ల మీటర్ల వస్త్రోత్పత్తి ఆర్డర్లు ఇవ్వాలి. ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు విడుదల చేయాలి.
- సిరిసిల్లలో యారన్ డిపోలు ఏర్పాటు చేయాలి. వర్కర్ టు ఓనర్ పథకాన్ని అమలు చేయాలి.
- యారన్ కొనుగోలులో 20 శాతం సబ్సిడీ అందించాలి. కార్మికులకు 10 శాతం యారన్ సబ్సిడీని, త్రిఫ్ట్ నేతన్నకు చేయూత పథకాన్ని అమలు పరచాలి. సిరిసిల్లలో మార్కెట్ వసతి కల్పించి, నేత బజార్ ఏర్పాటు చేయాలి.

చాలా సమస్యలున్నాయి



సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో చాలా సమస్యలున్నాయి. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని మంత్రులకు విన్నవించాం. కానీ, పరిష్కారం లభించలేదు. సాంచాలకు కరెంట్ సమస్య మరింత జటిలమైంది. ఇతర ప్రభుత్వ వస్త్రోత్పత్తి ఆర్డర్లు రావడం లేదు. పరిశ్రమను పరిరక్షించేందుకు జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళనలకు సిద్ధమయ్యాం.

– తాటిపాముల దామోదర్, జేఏసీ నాయకుడు

సాంచాలు బందుంటున్నయ్



సిరిసిల్లలో చాలా సాంచాలు బందుంటున్నయ్. కరెంట్ బిల్లులు కట్టలేక కార్ఖానాలకు తాళం వేశారు. దీంతో కార్మికులు రోడ్డున పడ్డారు. సిరిసిల్లలో సాంచాలు నడిస్తేనే.. కార్మికులకు ఉపాధి దొరుకుతుంది. ప్రభుత్వం స్పందించి, కరెంట్ సమస్యను పరిష్కరించి, బతుకమ్మ చీరల బకాయిలు వెంటనే చెల్లించాలి.

– ఆడెపు భాస్కర్, పాలిస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు

8 మంది ఆత్మహత్య చేసుకున్నరు



సిరిసిల్లలో సాంచాలను నడిపే కార్మికులు, ఇతర రంగాలపై ఆధారపడిన కార్మికులు ఆర్థికంగా చాలా ఇబ్బందుల్లో ఉన్నారు. ఇప్పటికే 8 మంది ఆత్మహత్య చేసుకున్నరు. అయినా, ప్రభుత్వం స్పందించడం లేదు. విధి లేని పరిస్థితుల్లో పోరాటానికి సిద్ధమయ్యాం. చలో హైదరాబాద్ విజయవంతం చేయాలి.

– మూషం రమేశ్, కార్మిక నాయకుడు



రాజన్న ఆలయ ఉద్యోగుల బోనాలు

వేములవాడ: రాజన్న ఆలయ ఉద్యోగులు ఆషాఢమాసం బోనాలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఉద్యోగుల సంఘం భవనం నుంచి బోనాలతో ఆలయానికి వెళ్లారు. పూజల అనంతరం బద్ది పోచమ్మ ఆలయానికి వెళ్లారు. హిజ్రాల విన్యాసాలు ఆకర్షణగా నిలిచాయి. సంఘం గౌరవ అధ్యక్షుడు సిరిగిరి శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి కూరగాయ ల శ్రీనివాస్, టీఎన్జీవో రాష్ట్ర నాయకుడు ఉపాధ్యాయుల చంద్రశేఖర్ తదితరులున్నారు.



క్లుప్తంగా

మొక్కల సంరక్షణలో భాగస్వాములవ్వాలి

● డీఐఈవో మోహన్



మొక్క నాటుతున్న డీఐఈవో మోహన్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మొక్కల సంరక్షణలో విద్యార్థులు భాగస్వాములవ్వాలని, నాటిన ప్రతీ మొక్కను బతికించాలని డీఐఈవో మోహన్ అన్నారు. ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో కలిసి శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు సామాజిక అంశాలపై దృష్టిసారించాలని సూచించారు. అధ్యాపకులు విలువలతో కూడిన విద్యనందించి, ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. ప్రభుత్వ కళాశాలలో ఉత్తీర్ణతా శాతం పెంచాలని, ప్రతిఒక్కరూ ఐదుకు తగ్గకుండా మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పర్శరాములు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐసీడీఎస్ సీడీపీవోల బదిలీ

సిరిసిల్లటౌన్: జిల్లా ఐసీడీఎస్‌లో బదిలీలు జరిగాయి. సిరిసిల్ల సీడీపీవో అలేఖ్య పటేల్ రామగుండానికి, వేములవాడ సీడీపీవో ఎల్లయ్య దుబ్బాకకు బదిలీ అయ్యారు. వీరి స్థానంలో సిరిసిల్లకు కరీంనగర్ రూరల్ నుంచి సబిత, వేములవాడకు గంగాధర నుంచి సౌందర్య బాధ్యతలు తీసుకోనున్నారు. కొత్త సీడీపీవోలు రెండు రోజుల్లో విధుల్లో చేరనున్నట్లు సమాచారం.

భార్య ఆత్మహత్యకు కారణమైన భర్త అరెస్టు

ముస్తాబాద్(సిరిసిల్ల): అదనపు కట్నం కోసం వేధించి, భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తను అరెస్టు చేసినట్లు సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ముస్తాబాద్ మండలం వెంకట్రావుపల్లెకు చెందిన ఎనగంటి రేఖ(26)ను ఆమె భర్త ఆంజనేయులు కొంతకాలంగా అదనపు వరకట్నం కోసం వేధిస్తున్నాడు. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన ఆమె రెండు రోజుల క్రితం ఉరేసుకుంది. ఆంజనేయులుపై కేసు నమోదు చేసి, శుక్రవారం అరెస్టు చేసినట్లు డీఎస్పీ పేర్కొన్నారు.

అంగన్‌వాడీ ఆయాలు దరఖాస్తు చేసుకోవాలి

సిరిసిల్లకల్చరల్: జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో అర్హత కలిగిన ఆయాలకు టీచర్లుగా ప్రమోషన్ ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని జిల్లా సంక్షేమ అధికారి పి.లక్ష్మీరాజం ఒక ప్రకటనలో తెలిపారు. కనీసం ఐదేళ్లపాటు ఆయాగా పని చేసిన అనుభవం, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత గల 45 ఏళ్లలోపు వారు దరఖాస్తు చేసుకోవాలని, స్థానికులకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఒక కేంద్రంలో ఒకటి కంటే ఎక్కువ దరఖాస్తులు వస్తే ఇంటర్మీడియట్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా ఎంపిక చేస్తామని తెలిపారు. ఈ ప్రక్రియ పూర్తిగా కలెక్టర్ పర్యవేక్షణలో జరుగుతుందని, దళారులను ఆశ్రయించవద్దని సూచించారు. అర్హులు ఈ నెల 30వ తేదీలోపు సంబంధిత సీడీపీవో ద్వారా జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలని పేర్కొన్నారు.

డెంగీ పేరిట దోపిడీ

- ర్యాపిడ్ టెస్ట్‌తోనే పాజిటివ్‌గా నిర్ధారణ
- చికిత్స అందిస్తూ రూ.లక్షల్లో వసూలు
- జిల్లాలోని చాలావరకు ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఇదే పరిస్థితి
- అప్పులపాలవుతున్న పేదలు
- 'ఎలీసా'తోనే డెంగీ నిర్ధారణ సాధ్యమంటున్న వైద్యాధికారులు
- కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రి, సిరిసిల్ల టీ-హబ్‌లోనే చేస్తారని వెల్లడి



సిరిసిల్ల ఏరియా ఆస్పత్రిలో జ్వర బాధితులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడీ రోజురోజుకూ పెరిగిపోతోంది. సీజనల్‌గా వచ్చే వైరల్ జ్వరాలను సైతం డెంగీగా చిత్రీకరిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఫలితంగా నిరుపేదలు నిలువుదోపిడీకి గురై.. ఆర్థికంగా చితికిపోతున్నారు. ప్రస్తుత వానాకాలంలో వస్తున్న జలుబు, జ్వరాలు, ఒళ్లు నొప్పులను ఆసరాగా చేసుకొని, వైద్య పరీక్షల పేరిట హడావుడి చేస్తూ ఇష్టం వచ్చినట్లు టెస్టులు రాస్తున్నారు. ప్రధానంగా డెంగీకి సంబంధించి ర్యాపిడ్ టెస్ట్ మాత్రమే చేసి, పాజిటివ్ అంటూ దండుకుంటున్నారు.

సొంత ల్యాబ్.. ఇచ్చిందే రిపోర్ట్

రాజన్నసిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా 144 ప్రైవేట్ ఆస్పత్రులు ఉన్నాయి. ప్రతీ ఆస్పత్రిలో రక్త, మూత్ర పరీక్షల ల్యాబ్‌లు ఉన్నాయి. ఆయా పరీక్ష కేంద్రాల్లోనే జ్వర బాధితులకు పరీక్షలు చేస్తూ రిపోర్టులు ఇస్తున్నారు. డెంగీగా నిర్ధారించే ×ఎలీసా× పరీక్ష జిల్లా కేంద్రంలోని టీ-హబ్‌లో మాత్రమే ఉంది. ఉమ్మడి జిల్లా కేంద్రం కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలోనూ చేస్తారు. కానీ, జిల్లాలోని చాలావరకు ప్రైవేట్ ఆస్పత్రుల్లో అప్పటికప్పుడు ర్యాపిడ్ టెస్ట్ చేసి, డెంగీ పాజిటివ్ అని తేల్చేస్తున్నారు. చికిత్స అందిస్తూ రూ.లక్షల్లో బిల్లులు వసూలు చేస్తున్నారు. దీంతో పేద, మధ్యతరగతి ప్రజలు అప్పులపాలవుతున్నారు. అయితే, ర్యాపిడ్ టెస్ట్ చేసినా పూర్తి నిర్ధారణకు ఎలీసా పరీక్ష చేయాల్సిందేనని వైద్యాధికారులు స్పష్టం చేస్తున్నారు.

ఏడు నెలల్లో ఎనిమిదే కేసులు..

జిల్లా వ్యాప్తంగా గత జనవరి నుంచి ఈ నెల 26 వరకు ఎనిమిది డెంగీ కేసులు మాత్రమే నమోదయ్యాయి. జిల్లాలో ప్రస్తుతం వైరల్ జ్వరాలు విజృంభిస్తుండటంతో ఆస్పత్రుల్లో జ్వర బాధితుల సంఖ్య పెరుగుతోంది. జ్వరం, ఒళ్లు నొప్పుల తీవ్రత ఎక్కువగా ఉంటుండటంతో చాలామంది ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తున్నారు. కానీ, జ్వరం, ఒళ్లునొప్పులకు భయాందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు చెబుతున్నారు. ఎలీసా పరీక్ష చేసిన తర్వాత డెంగీగా నిర్ధారణ అయితేనే సంబంధిత చికిత్స తీసుకోవాలని సూచిస్తున్నారు.

ఆస్పత్రులను సీజ్ చేస్తామని హెచ్చరిక

జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో ర్యాపిడ్ టెస్ట్ చేసి, డెంగీగా నిర్ధారిస్తే చర్యలు తీసుకుంటామని వైద్యాధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రతీ దవాఖానాకు సర్క్యులర్ జారీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. జ్వరపీడితులకు రక్తకణాలు తగ్గాయని, డెంగీ సోకిందంటూ భయాందోళనకు గురిచేస్తే ఆస్పత్రులను సీజ్ చేస్తామంటున్నారు. దీంతోపాటు జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే జ్వరపీడితులకు డెంగీ వ్యాధిపై అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచిస్తున్నారు.

> **'ప్రైవేట్'లో ఎలీసా చేయలేరు**
>
> 
>
> జిల్లాలోని ఏ ప్రైవేట్ ఆస్పత్రి ల్యాబ్‌లోనూ డెంగీ నిర్ధారణకు సంబంధించిన ఎలీసా పరీక్ష చేయలేరు. ఒక్క కరీంనగర్‌లోని జనరల్ ఆస్పత్రి, సిరిసిల్లలోని టీ-హబ్‌లో మాత్రమే చేస్తారు. ఈ ఏడాది ఇప్పటివరకు జిల్లాలో 8 డెంగీ కేసులు మాత్రమే నమోదయ్యాయి. ఈ కేసులు ఎక్కువగా ఉన్నాయన్న ప్రచారంలో వాస్తవం లేదు. డెంగీ పేరిట ఇష్టారీతిన పరీక్షలు చేస్తూ బాధితులను భయాందోళనకు గురిచేస్తే చర్యలు తీసుకుంటాం.
>
> – రాజగోపాల్‌రావు, జిల్లా కీటక వ్యాధుల నియంత్రణ అధికారి

గంజాయి సేవిస్తున్న నలుగురి అరెస్టు



అరెస్టు చూపుతున్న సీఐ కృష్ణ



అరెస్టు చూపుతున్న సీఐ శ్రీనివాస్‌గౌడ్

సిరిసిల్ల క్రైం: గంజాయి సేవిస్తున్న నలుగురిని సిరిసిల్ల టౌన్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. సీఐ కృష్ణ వివరాల ప్రకారం.. తంగళ్లపల్లి మండలంలోని లక్ష్మీపూర్‌కు చెందిన వీరబోయిన అజయ్ డ్రైవర్‌గా పని చేస్తూ జల్సాలకు అలవాటు పడ్డాడు. గంజాయికి బానిసయ్యాడు. ఇతరుల వద్ద కొనుగోలు చేసి, విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అలాగే, సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చిన్నబోనాలకు చెందిన ఆవునూరి ప్రశాంత్, పండుగ మహేశ్, సందవేణి మహేశ్ గంజాయి సేవిస్తున్నారని పోలీసులకు సమాచారం రావడంతో వెళ్లి, కిట్‌తో పరీక్షలు చేశారు. పాజిటివ్ రావడంతో వారిని అరెస్టు చేశారు. 150 గ్రాముల గంజాయి, 5 గంజాయి సిగరెట్లు స్వాధీనం చేసుకున్నారు.

దుమాల శివారులో ఇద్దరు..

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఇద్దరు గంజాయి విక్రేతలను అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాస్ గౌడ్ శుక్రవారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిపేట మండలం దుమాల శివారులోని వంతెన వద్ద గురువారం సాయంత్రం ఇద్దరు యువకులు గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే వారు అక్కడికి వెళ్లగా ఇద్దరు అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించారు. వారిని పట్టుకొని, విచారించగా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన చింతకింది భానుచందర్, గోనె ఉదయ్ అని తేలింది. వీరు గంజాయికి బానిసలయ్యారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలన్న ఉద్దేశంతో కరీంనగర్‌కు చెందిన ఓ వ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేసి, స్థానికంగా విక్రయిస్తున్నారు. భానుచందర్, ఉదయ్‌లను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామని సీఐ పేర్కొన్నారు. వీరికి గంజాయి విక్రయించిన వ్యక్తి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై రమాకాంత్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి టెస్ట్‌లో పాజిటివ్.. అరెస్టు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): గంజాయి విక్రేత, ఇల్లంతకుంట మండల కేంద్రానికి చెందిన ఆటోడ్రైవర్ మహమ్మద్ జమీర్‌ను అరెస్టు చేసినట్లు సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి, ఎస్సై శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. జమీర్ గంజాయికి అలవాటు పడ్డాడన్నారు. శుక్రవారం ఇల్లంతకుంట జూనియర్ కళాశాల సమీపంలో గంజాయి కొనుగోలు చేసేందుకు ఎదురుచూస్తుండగా పోలీసులు పట్టుకున్నారని పేర్కొన్నారు. గంజాయి టెస్టింగ్ కిట్ ద్వారా పరీక్ష చేయగా పాజిటివ్ వచ్చిందన్నారు. అతని వద్ద నుంచి 100 గ్రాముల గంజాయి, ఒక మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

మధులతకు రూ.1.01 లక్షల ఆర్థికసాయం



ఆర్థికసాయం అందించిన అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, సేవాలాల్ ప్రతినిధులు

సిరిసిల్ల: పాట్నా ఐఐటీలో సీటు సాధించిన బదావత్ మధులతకు సేవాలాల్ సోషల్ సర్వీస్ సంస్థ ప్రతినిధులు రూ.1.01 లక్షల ఆర్థికసాయాన్ని శుక్రవారం అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టుదలగా చదువుతూ, ఉన్నత లక్ష్యంతో ముందుకుసాగాలని మధులతకు సూచించారు. పేద విద్యార్థినికి ఆర్థికసాయం అందించడం అభినందనీయమన్నారు. ఆమె ఆర్థిక పరిస్థితిపై 'సాక్షి' అందించిన కథనాన్ని అభినందించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు భూక్య కళావతి హజు నాయక్, భానోతు పద్మ, సేవ్యనాయక్, భూక్యా గజన్‌లాల్, రవిలాల్ నాయక్, భూక్యా లింగం, రాజు నాయక్, గోపి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ మార్కెట్ కమిటీకి తీవ్ర పోటీ

- వచ్చే నెలలో పాలకవర్గం ఏర్పాటు చేస్తామన్న విప్ ఆది శ్రీనివాస్
- ఆశావాహుల పైరవీలు



వేములవాడ మార్కెట్ కమిటీ కార్యాలయం

వేములవాడరూరల్: పదేళ్లు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ ప్రస్తుతం అధికారంలోకి వచ్చింది. దీంతో నామినేటెడ్ పదవుల కోసం ఆ పార్టీ నాయకుల్లో తీవ్ర పోటీ నెలకొంది. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఇటీవల వేములవాడ రూరల్ మండల పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఆ సమయంలో వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని వచ్చే నెలలో ఏర్పాటు చేయనున్నట్లు చెప్పడంతో రూరల్ మండలంలోని 17 గ్రామాలు, అర్బన్ మండలంలోని పలువురు సీనియర్లు చైర్మన్, డైరెక్టర్ పదవుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రధానంగా విప్ శ్రీనివాస్‌కు ముందునుంచి అండగా నిలిచిన నూకలమర్రికి చెందిన బొడ్డు రాములు, నాగాయపల్లికి చెందిన మాజీ సర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రొండి రాజు, చెక్కపల్లికి ఎడపల్లి అనిల్‌ల మధ్య పోటీ ఉందన్న చర్చ జరుగుతోంది.

చైర్మన్ పదవి ఎస్సీ సామాజికవర్గానికి..

వేములవాడ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఎస్సీ సామాజిక వర్గానికి కేటాయించారు. దీంతో పలువురు సీనియర్లు తమకే ఇవ్వాలంటూ ఇప్పటికే మండల, జిల్లా, రాష్ట్ర నాయకులతో పైరవీలు చేయిస్తున్నట్లు తెలిసింది.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

● డిప్యూటీ డీఎంహెచ్‌వో రాజగోపాల్



డిప్యూటీ డీఎంహెచ్‌వోకు మొక్క అందిస్తున్న వైద్యాధికారి, సిబ్బంది

ముస్తాబాద్(సిరిసిల్ల): సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో రాజ్‌గోపాల్ అన్నారు. ముస్తాబాద్ మండలంలోని పోతుగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. గర్భిణులు, బాలింతల వివరాలు తెలుసుకున్నారు. ప్రజలు డెంగీ, మలేరియా జ్వరాల బారిన పడకుండా క్షేత్రస్థాయి సిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు. డ్రైడే పాటించేలా చూడాలన్నారు. వైద్యాధికారి గీతాంజలి, సీహెచ్‌వో బాలచంద్రం, హెచ్ఈవో యాదగిరి, పీహెచ్ఎన్ జ్యోతి, సూపర్‌వైజర్లు లక్ష్మీప్రసాద్, వరలక్ష్మి, స్టాఫ్‌నర్స్ భాగ్య, ఎంఎల్‌హెచ్‌పీ రజిత, ఫార్మసిస్టు సంగీత పాల్గొన్నారు.

లింగన్నపేట పీహెచ్‌సీ తనిఖీ

గంభీరావుపేట(సిరిసిల్ల): లింగన్నపేట పీహెచ్‌సీని డిప్యూటీ డీఎంహెచ్‌వో రాజ్‌గోపాల్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వైద్యాధికారి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆస్పత్రిలోని రికార్డులను పరిశీలించారు. ఔట్ పేషెంట్, ఇన్ పేషెంట్‌ల వివరాలు, మందుల వినియోగం తదితర అంశాలను తెలుసుకున్నారు. వైద్యాధికారి వేణుగోపాల్‌రెడ్డి, సీహెచ్‌వో రమేశ్ తదితరులున్నారు.

గంజాయి తీసుకుంటే పట్టేస్తది..

- టెస్టింగ్ కిట్ తీసుకొచ్చిన రాజన్నసిరిసిల్ల పోలీసులు
- గంజాయి తాగిన 45 రోజులకు యూరిన్ పరీక్ష చేసినా చెప్పేస్తుంది..
- పాత నేరస్తులకు పరీక్షలు.. పోలీసుల అదుపులో పలువురు
- రవాణాదారుల్లో వణుకు



గంజాయి టెస్టింగ్ కిట్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఇన్నాళ్లూ.. గంజాయి సేవించినా దొరికిపోయే పరిస్థితులు లేవన్న ధీమాతో యథేచ్ఛగా దందా సాగుతోంది. ఇకపై దానికి చెక్ పడనుంది. ఇటీవల రాజన్నసిరిసిల్ల జిల్లా పోలీస్‌శాఖ అధికారులు ప్రత్యేక చొరవతో గంజాయి టెస్టింగ్ కిట్‌ను జిల్లాకు తీసుకొచ్చారు. దీని ద్వారా గంజాయి తాగిన వారి యూరిన్ శాంపిల్ తీసుకొని, పరీక్షిస్తే వ్యసనపరులు ఇట్టే దొరికిపోతారు. తాజాగా ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట మండలాల్లో గంజాయికి అలవాటుపడిన పలువురిని పోలీసులు ఈ కిట్‌తో గుర్తించి, అదుపులోకి తీసుకున్నారు. దీంతో గంజాయి రవాణాదారుల్లో వణుకు పడుతోంది.

దందాకు చెక్ పెట్టేందుకు..

ఎస్పీ అఖిల్‌మహాజన్ జిల్లాలో గంజాయి దందాకు చెక్ పెట్టేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నారు. ఇందులో భాగంగా తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో(టీన్యాబ్) రూపొందించిన ప్రత్యేక కిట్‌ను జిల్లాకు తెప్పించారు. ఇది గంజాయి తాగిన 45 రోజులకు యూరిన్ పరీక్ష చేసినా చెప్పేస్తుంది. పోలీసులు కిట్‌ను ఉపయోగిస్తుండటంతో మత్తుకు అలవాటుపడిన యువత భయాందోళనకు గురవుతోంది.

డొంక కదులుతోంది..

జిల్లాలో చాపకింద నీరులా గంజాయి దందా సాగుతోంది. ఇప్పటికే ప్రతీ పల్లెకు విస్తరించింది. కిరాణా దుకాణాలు, పాన్ టేలాలు, శివారు ప్రాంతాలను అడ్డాలుగా చేసుకొని, గంజాయి విక్రయిస్తున్నారు. దీనికి అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు గత కొంతకాలంగా అనేక ప్రయత్నాలు చేస్తున్నా ఫలితం ఉండటం లేదు. ఈ నేపథ్యంలో టెస్టింగ్ కిట్ అందుబాటులోకి రావడంతో పాత నేరస్తులు, గంజాయికి అలవాటుపడిన యువతను అదుపులోకి తీసుకొని, పరీక్షిస్తున్నారు. పాజిటివ్ వస్తే.. విచారణ జరిపి, కీలక సమాచారం రాబడుతున్నారు. ఇలా.. ఇటీవల గంభీరావుపేటకు చెందిన ఓ యువకుడు తన వ్యాపార నిమిత్తం మహారాష్ట్రలోని నాందేడ్‌కు వెళ్లి.. అక్కడే గంజాయి కొనుగోలు చేసినట్లు తేలింది. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల నుంచి గంజాయి మన ప్రాంతానికి దిగుమతి అవుతోందని పలువురు ఒప్పుకున్నట్లు తెలిసింది.

> **పాజిటివ్ వస్తోంది..**
>
> 
>
> ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రత్యేకంగా చొరవ చూపి, జిల్లాకు గంజాయి టెస్టింగ్ కిట్ తెప్పించారు. అనుమానితులు, పాత నేరస్తుల యూరిన్ శాంపిళ్లను పరీక్షిస్తున్నాం. రిపోర్ట్‌లో కొంతమందికి పాజిటివ్ వస్తోంది. వారిని విచారిస్తే గంజాయి ఎక్కడి నుంచి సరఫరా అవుతుందో తెలిసే అవకాశం ఉంది. ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నాం.
>
> – శ్రీనివాస్‌గౌడ్, సీఐ, ఎల్లారెడ్డిపేట

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ రెగ్యులర్&డిస్టెన్స్ అడ్మిషన్స్:డిగ్రీ,PG, B.Tech ,Diploma, D-ఫార్మసీ, B-ఫార్మసీ, B.Ed, B.P.Ed, MBA, MCA, B.Sc(Agri), B.Sc (నర్సింగ్), GNM. * 4 నెలల్లో పరీక్షలు 8866977112, 339 [HA-16328]

SERVICES

OLD AGE HOME

■ త్రినేత్రహోంకేర్ వృద్ధులను,పేషెంట్స్‌ను, చంటిపిల్లలను, వంట / ఇంటిపని 24 గం॥లు చూసుకోవడానికి మీ ఇంటి వద్దకే కేర్ టేకర్స్‌ను పంపబడును. హైదరాబాద్. ఫోన్: 7396857799,7396753377 [H-796261]

WANTED

■ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుటకు ఇంటిపని,వంటపనికు వర్కర్స్/నర్సులు కావలెను.ఫ్రీవసతి + భోజనం. జీ: 20 K. ఫోన్: 8977639662, 8977639663 [H-796259]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933
9951602824

వీడని ముసురు..

● కోనరావుపేటలో అత్యధికంగా 12.1 మి.మీ. వర్షం

సిరిసిల్ల: జిల్లాలో ముసురు వీడటం లేదు. శుక్రవారం కోనరావుపేటలో అత్యధికంగా 12.1 మి.మీ., ముస్తాబాద్‌లో అత్యల్పంగా 7.0 మి.మీ. వర్షం కురిసింది. రుద్రంగిలో 8.6, చందుర్తిలో 11.1, వేములవాడ రూరల్‌లో 9.4, బోయినపల్లిలో 8.1, వేములవాడలో 8.7, సిరిసిల్లలో 10.5, వీర్నపల్లిలో 10.6, ఎల్లారెడ్డిపేటలో 8.9, గంభీరావుపేటలో 10.6, తంగళ్లపల్లిలో 10.4, ఇల్లంతకుంటలో 7.9 మిల్లీమీటర్ల వాన పడింది.

30న క్రీడాకారులకు ఎంపిక పోటీలు

సిరిసిల్ల కల్చరల్: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రన్నింగ్, లాంగ్‌జంప్, హైజంప్, జావెలిన్ త్రో క్రీడాంశాల్లో ఈ నెల 30న జిల్లాస్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు చిక్కాల రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. సిరిసిల్ల ప్రభుత్వ కళాశాల మైదానంలో పోటీలు జరుగుతాయని, 14 నుంచి 20 ఏళ్లలోపు వయసున్న క్రీడాకారులు పాల్గొనవచ్చన్నారు. సత్తాచాటిన వారిని ఆగస్టు 7న రంగారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపించనున్నట్లు పేర్కొన్నారు. హాజరైన క్రీడాకారులందరికీ ప్రశంసాపత్రాలు, విజేతలకు గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ అందదించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు పదో తరగతి మెమో లేదా తహసీల్దార్ జారీ చేసిన పుట్టిన తేదీ ధ్రువపత్రాన్ని వెంట తెచ్చుకోవాలని అసోసియేషన్ కార్యదర్శి బొజ్జా చంద్రశేఖర్ సూచించారు. వివరాలకు 79014 64456 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

నేడు పాలిసెట్ ప్రత్యేక విడత ధ్రువపత్రాల పరిశీలన

వేములవాడఅర్బన్: రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో పాలిసెట్ ప్రత్యేక విడత ప్రవేశాల ప్రకటన విడుదలైందని అగ్రహారం శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రాజగోపాల్ తెలిపారు. కళాశాలలో శనివారం ధ్రువపత్రాల పరిశీలన నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే, శని, ఆదివారాల్లో వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని, ఈ నెల 31న సీట్లు కేటాయిస్తారని తెలిపారు. మొదటి, రెండో విడతల్లో సీటు రానివారు, వచ్చినా చేరనివారు, చేరినా మరో కళాశాలకు వెళ్లాలనుకునేవారు ప్రత్యేక విడతలో ఆప్షన్ ఇచ్చుకోవాలని సూచించారు. అభ్యర్థులు వీలైనన్ని ఎక్కువ ఆప్షన్లు ఇస్తే మంచిదన్నారు. పాలిటెక్నిక్ కళాశాలల్లో మిగిలిన సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్ల ప్రకటన ఆగస్టు 8న విడుదల చేస్తారని పేర్కొన్నారు.

రైతు ఇంటి వద్దే రిజిస్ట్రేషన్



రిజిస్ట్రేషన్ చేస్తున్న తహసీల్దార్ శ్రీలత

రుద్రంగి(వేములవాడ): మండల కేంద్రానికి చెందిన రైతు మోతె వెంకటి అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. దీంతో తహసీల్దార్ శ్రీలత శుక్రవారం ఆయన ఇంటికి వెళ్లారు. వెంకటి కొడుకు లింబాద్రికి 1.20 ఎకరాల భూమిని గిఫ్ట్ డీడ్ కింద రిజిస్ట్రేషన్ చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కుక్క దాడిలో వృద్ధుడికి గాయాలు



చికిత్స పొందుతున్న లక్ష్మణ్

గంభీరావుపేట(సిరిసిల్ల): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఏరియాలో లింగన్నపేటకు చెందిన గడప లక్ష్మణ్ అనే వృద్ధుడిపై శుక్రవారం వీధి కుక్క దాడి చేసిందని స్థానికులు తెలిపారు. ఈ ఘటనలో అతనికి గాయాలయ్యాయని, అటుగా వస్తున్న కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణశాఖ అధ్యక్షులు హమీద్, రాజుగౌడ్‌లు బాధితుడిని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారని పేర్కొన్నారు. ప్రథమ చికిత్స అనంతరం 108 సిబ్బంది సిరిసిల్ల సివిల్ ఆస్పత్రికి తరలించారన్నారు. కుక్కల బెడద తీవ్రమైందని, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బొప్పాపూర్‌లో వృద్ధురాలిపై దాడి



గాయపడిన నర్సవ్వ

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్ల బొప్పాపూర్‌కు చెందిన సఫాయి కార్మికురాలు ర్యాకం నర్సవ్వ (68)పై అదే గ్రామానికి చెందిన బత్తుల రాజు దాడి చేశాడని పోలీసులు తెలిపారు. బాధితురాలికి గాయాలవడంతో స్థానికులు ఆస్పత్రికి తరలించారన్నారు. నర్సవ్వకు, రాజుకు దారి విషయంలో కొన్ని రోజులుగా గొడవలు జరుగుతున్నాయని అన్నారు. ఈ క్రమంలో శుక్రవారం మద్యం మత్తులో అతను నర్సవ్వను దుర్భాషలాడుతూ.. కర్రతో కొట్టడంతో తీవ్ర గాయాలైనట్లు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో సీపీఆర్‌పై అవగాహన

సిరిసిల్లకల్చరల్: గుండెపోటు వచ్చినప్పుడు చేయాల్సిన సీపీఆర్‌పై శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అవగాహన కల్పించనున్నట్లు డీఎంహెచ్‌వో వసంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం స్మృత్యర్థం పునర్జన్మ పేరిట ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు జరిగే కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

నీటమునిగి గొర్రెల కాపరి మృతి

చిగురుమామిడి(హుస్నాబాద్): రేకొండకు చెందిన మొగిలి బొందయ్య (75) గొర్రెను కాపాడబోయి నీటమునిగి మృతి చెందాడు. గ్రామస్తులు, పోలీసుల తెలిపిన వివరాలు...రోజు మాదిరిగానే శుక్రవారం గొర్రెలను గ్రామ శివారులోకి తీసుకెళ్లాడు. మందలోని గొర్రెపిల్ల బొడ్డ శంకర్‌కు చెందిన వ్యవసాయ బావిలో పడింది. దాన్ని కాపాడేందుకు వ్యవసాయబావిలోకి దిగడంతో ప్రమాదవశాత్తు నీటమునిగాడు. విషయం తెలుసుకున్న బంధువులు, గ్రామస్తులు మృతదేహం కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో చిగురుమామిడి ఎస్సై బి. రాజేశ్ గజ ఈతగాళ్లను రప్పించారు. రెండు మూడు గంటలపాటు గాలించగా సాయంత్రం బొందయ్య మృతదేహం లభ్యమైంది. కొడుకు ఓదెలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

బడ్జెట్‌లో బీసీ సంక్షేమానికి మొండిచేయి



కరీంనగర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్ కేటాయింపులో బీసీ సంక్షేమానికి మొండి చేయి చూపిందని బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింగోజు శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చిగుర్ల శ్రీనివాస్‌తో కలిసి మాట్లాడారు. కేంద్రబడ్జెట్ 48లక్షల20వేల 512 కోట్ల బడ్జెట్‌లో కేవలం బీసీలకు సంక్షేమానికి 3,300 కోట్లు కేటాయించడం సరికాదన్నారు. కొన్నేళ్లుగా ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు 5,500 కోట్ల పైన బకాయిలుంటే రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బీసీ సంక్షేమానికి 9,200 కోట్లు సరిపోవన్నారు. ప్రభుత్వం బీసీ కులగణన చేపట్టిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షురాలు గుంటి స్వరూప శ్యాం, యువజన సంఘం నగర అధ్యక్షుడు అనుమాస నితిన్, యువజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బాలకృష్ణ, యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది శ్రీనివాస్, యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నల్లగొని శ్రీనివాస్, బీసీ సంఘం మహిళా నాయకురాలు సరిత, బీసీసంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.